సాక్షి
పెద్దపల్లి
గురువారం। 16। నవంబర్। 2023



మద్యం దుకాణంలో తనిఖీ

జ్యోతినగర్: ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్డులోని ఎస్‌వీఎస్ మద్యం దుకాణంలో రోజువారీ విక్రయాల రికార్డులను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఎక్సైజ్ సీఐ రమేశ్ బుధవారం తనిఖీ చేశారు. స్టాక్, అమ్మకాలపై ఆరా తీశారు.



రెండోరోజు గంగాహారతి

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో రెండోరోజైన బుధవారం గంగాహారతి కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం
32.0/26.0

వాతావరణం

ఆకాశంలో పొగమంచు కమ్ముకుంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. చలిగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సీఎంఆర్ పూర్తిచేయాలి



మాట్లాడుతున్న శ్యామ్‌ప్రసాద్

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని రైసుమిల్లర్లు నిర్ణీత గడువులోగా సీఎంఆర్ డెలివరీ పూర్తిచేయాలని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం సీఎంఆర్‌పై సమీక్షించారు. రైసుమిల్లులు పూర్తిస్థాయి సామర్థ్యంతో పనిచేసి నిర్ణీత గడువులోగా లక్ష్యాలు సాధించాలన్నారు. గడువులోగా డెలివరీ చేయని మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధాన్యం కొనుగోళ్లలో తరుగు పేరిట కోతలు లేకుండా దిగుమతి చేసుకోవాలని సూచించారు. సమావేశంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, డీఎస్‌వో ప్రేమ్‌కుమార్, మిల్లర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



గోల్డ్‌మెడల్‌తో గణేశ్‌నాయక్

గోదావరిఖనిటౌన్: స్థానిక సప్తగిరికాలనీలోని మహాత్మాజ్యోతిబాపూలే బాలుర గురుకుల విద్యార్థులు జిల్లాస్థాయి స్టేట్ సెలక్షన్స్ అథ్లెటిక్ పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. ఇందులో 1,500 మీటర్ల పరుగు పందెంలో డి.అజయ్ గోల్డ్‌మెడల్, యు.మణిదీప్ సిల్వర్ మెడల్ సాధించారు. 3,000 మీటర్ల రన్నింగ్‌లో జి.విష్ణువర్ధన్ గోల్డ్‌మెడల్, డి.అజయ్ సిల్వర్ మెడల్ సాధించారు. 100 మీటర్ల రన్నింగ్, లాంగ్‌జంప్‌లో గణేశ్‌నాయక్ రెండు గోల్డ్‌మెడల్స్ సాధించి రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యాడు. వీరిని ప్రిన్సిపాల్ శ్రీకాంత్, పీఈటీ మంథెన వెంకటేశ్, ఉపాధ్యాయులు తదితరులు బుధవారం అభినందించారు.

ఉమ్మడి జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న వైస్‌ఎంపీపీ మట్ట లక్ష్మి

రామగుండం: కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ లీగ్ పోటీలను అంతర్గాం మండల కేంద్రంలో బుధవారం ప్రారంభించారు. ఎనిమిది మండలాల నుంచి జట్లు హాజరయ్యాయి. అంతర్గాం వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి పోటీలు ప్రారంభించారు. తొలిరోజు గోదావరిఖని–యైటింక్లయిన్‌కాలనీ, అంతర్గాం–కరీంనగర్, గోదావరిఖని–హుజూరాబాద్ జట్లు తలపడ్డాయి. గురువారం పోటీలు ముగుస్తాయని ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపా రు. కార్యక్రమంలో ప్రతినిధులు డబ్ల్యూ.గణపతి, కోల సంతోష్‌గౌడ్, వెంకట్రావు, వెంకటేశ్, నరేశ్‌కుమార్, అంగోతు శ్రీనివాస్, ప్రవీణ్, రాము, శివకుమార్, శ్రీనివాస్, గాంధీ, ఇ.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసలు




ప్రశంసపత్రం అందిస్తున్న ఆర్‌ఎం సుచరిత

గోదావరిఖనిటౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలో అక్టోబర్–2023లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన పలువురు ఉద్యోగులను బుధవారం అభినందించారు. రీజినల్ మేనేజర్ ఎస్.సుచరిత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసపత్రాలు, నగదు పురస్కారాలు అందజేశారు. డిపో మేనేజర్ నాగభూషణం, అసిస్టెంట్ మేనేజర్ కె.గీతాకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్(మెకానికల్) సంధ్యారాణి, ఎంప్లాయీస్ వెల్ఫేర్ బోర్డు సభ్యులు వి.ఇందిరాదేవి, టీకే స్వామి, ఉద్యోగులు పాల్గొన్నారు.

11 కేసులు.. రూ.42 లక్షలు సీజ్

పెద్దపల్లిరూరల్: ఎన్నికల సంఘం నిబంధనలను ఉల్లంఘించే వారిపై సత్వర చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.కోటి51లక్షల 16వేల860 పట్టుకోగా అందులో రూ.కోటి9లక్షల16వేల860కు ఆధారాలు చూపడంతో విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే రూ.42లక్షలు సీజ్ చేసినట్లు తెలిపారు. ఉల్లంఘనలకు సంబంధించి అందిన ఫిర్యాదులపై 11కేసులు నమోదు చేసినట్లు కలెక్టర్ వివరించారు. ఇప్పటివరకు సీవిజిల్ యాప్ ద్వారా 137 ఫిర్యాదులు, 1950 టోల్‌ఫ్రీ నంబరు ద్వారా 1339 ఫిర్యాదులు అందగా పరిష్కరించామని పేర్కొన్నారు.

బరిలో 216 మంది



- నామినేషన్ ఉపసంహరించుకున్న 57 మంది అభ్యర్థులు
- స్వతంత్రులు, చిన్న పార్టీలకు గుర్తుల కేటాయింపు
- తప్పుకున్న ఉమ, కటకం, నల్ల, నాగి
- చాలాచోట్ల త్రిముఖ పోటీ!

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నామినేషన్ల స్క్రూటినీ పూర్తయింది. 12 నియోజకవర్గాల్లో మొత్తం 216 మంది పోటీలో ఉండగా.. 57 మంది తమ నామినేషన్ ఉపసంహరించుకున్నారు. జాతీయ, స్థానిక పార్టీల నుంచి పలువురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లతోపాటు ఈసారి బీఎస్పీ, ఏఐఎఫ్‌బీ లాంటి పార్టీల నుంచి బరిలో ఉండటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రతీ నియోజకవర్గంలో కనీసం మూడు పార్టీలు బరిలో ఉన్నాయి. గతంలో బీజేపీకి సరైన అభ్యర్థులు దొరకని పరిస్థితి. ఈసారి మాత్రం దాదాపు అన్నిచోట్ల బలమైన కేండిడేట్లు ఉన్నారు. మూడు బలమైన పార్టీలు ఉండటంతో త్రిముఖ పోరు తప్పేలా లేదు. మరోవైపు ఆర్వోలు ఇండిపెండెంట్లు, చిన్న పార్టీలకు డ్రా సిస్టమ్ ద్వారా గుర్తులను కేటాయించారు. దీంతో స్వతంత్రులందరూ తమకు కేటాయించిన గుర్తులతో ప్రచారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రధాన పార్టీలన్నీ అగ్రనేతలతో భారీ బహిరంగ సభలకు, కార్నర్ మీటింగులకు ఇప్పటికే అనుమతులు తీసుకున్నాయి.

నియోజకవర్గాల వారీగా సమాచారం

నియోజకవర్గం	బరిలో	విత్‌డ్రా
కరీంనగర్	27	04
హుజూరాబాద్	22	11
చొప్పదండి	14	03
మానకొండూరు	10	03
సిరిసిల్ల	21	02
వేములవాడ	16	04
పెద్దపల్లి	17	08
మంథని	21	03
రామగుండం	23	03
జగిత్యాల	15	04
కోరుట్ల	15	05
ధర్మపురి	15	03
మొత్తం	216	57

తప్పుకున్న వారిలో బంధువులే అధికం

నామినేషన్ ఉపసంహరించుకున్న వారిలో అధికంగా ప్రధాన పార్టీలకు చెందిన డమ్మీ కేండిడేట్లు, అక్కడక్కడా అసంతృప్తులు ఉండటం గమనార్హం. స్వచ్ఛందంగా తప్పుకున్న వారిలో మంత్రి కమలాకర్ సతీమణి గంగుల రజిత, ఆది శ్రీనివాస్ భార్య వనజ ఉన్నారు. ఇక బీఫాం ఇవ్వకపోవడంతో తిరస్కరణకు గురైన వారిలో మంథని నుంచి పుట్ట మధు సతీమణి శైలజ, చల్లా నారాయణ రెడ్డి సతీమణి సుజాత, పెద్దపల్లి నుంచి దాసరి మనోహర్‌రెడ్డి కోడలు మమతారెడ్డి, కరీంనగర్ నుంచి పురమళ్ల శ్రీను సతీమణి లలిత, మానకొండూరులో కవ్వంపల్లి సత్యనారాయణ సతీమణి అనురాధ, కోరుట్లలో కె.సంజయ్ తండ్రి విద్యాసాగర్‌రావు ఉన్నారు. చొప్పదండిలో కాంగ్రెస్ రెబల్ నాగి శేఖర్, పెద్దపల్లి బీఆర్ఎస్ రెబెల్ నల్ల మనోహర్‌రెడ్డి పోటీ నుంచి తప్పుకున్నారు. సిరిసిల్ల నుంచి స్వతంత్ర అభ్యర్థి కటకం మృత్యుంజయం, వేములవాడ నుంచి బీజేపీ టికెట్ ఆశించి భంగపడ్డ తుల ఉమ పోటీ నుంచి వైదొలిగారు.

ఏడుచోట్ల డబుల్ ఈవీఎంలు

ఉమ్మడి జిల్లాలో మొత్తం ఏడుచోట్ల డబుల్ ఈవీఎంలు వచ్చే అవకాశాలున్నాయి. సాధారణంగా ఒక ఈవీఎంలో గరిష్టంగా 16 గుర్తులు (నోటాతో కలిపి) కేటాయించే వీలుంది. ఒకవేళ అభ్యర్థులు 15 మంది దాటితే.. రెండో ఈవీఎం వినియోగం అనివార్యమవుతుంది. చొప్పదండి, మానకొండూరు, జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల నియోజకవర్గాల్లో సింగిల్ ఈవీఎం వినియోగించనున్నారు. ఇందులో చొప్పదండి, మానకొండూరు, ధర్మపురి ఎస్సీ నియోజకవర్గాలు. ఇక మిగిలిన కరీంనగర్, హుజూరాబాద్, రామగుండం, మంథని, పెద్దపల్లి, సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో బరిలో ఉన్న అభ్యర్థుల సంఖ్య 15 మందికి మించి ఉండటంతో ఇక్కడ రెండో ఈవీఎం తప్పనిసరి.

స్వతంత్రులకు గుర్తుల కేటాయింపు



సమావేశంలో కలెక్టర్ ముజామిల్‌ఖాన్, అభ్యర్థులు

- కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్

గోదావరిఖని: స్వతంత్ర అభ్యర్థులకు పారదర్శకంగా గుర్తులు కేటాయించినట్లు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్, రామగుండం ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ తెలిపారు. బుధవారం రిటర్నింగ్ కార్యాలయంలో స్వతంత్ర అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. లాటరీ విధానంలో స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించామన్నారు. ఆమోదం పొందిన అభ్యర్థులు 26మంది ఉండగా, ముగ్గురు తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నట్లు పేర్కొన్నారు. 23మంది పోటీలో ఉన్నారని తెలిపారు. ఇద్దరు స్వతంత్రులు తమ ప్రాధాన్యత క్రమంలో ఒకేగుర్తు ఎంచుకుంటే.. లాటరీ పద్ధతిన గుర్తులు కేటాయించామని ఆయన వివరించారు.

ఓటర్లకు స్లిప్పులు అందించాలి



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ

గోదావరిఖని: నియోజకవర్గంలోని ప్రతీఓటరుకు ఓటరు స్లిప్పు అందించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ సూచించారు. బుధవారం రామగుండం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ నిర్వహణ, ఓటరు స్లిప్పుల పంపిణీపై సెక్టార్ ఆఫీసర్లతో సమావేశమయ్యారు. నిర్ణీత సమయంలో ఓటరు స్లిప్పులు అందించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఓటరు స్లిప్పుల ముద్రణ, పంపిణీ పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఓటరు జాబితాపై వచ్చిన ఫిర్యాదులు, తీసుకున్న చర్యల వివరాలు రిజిష్టర్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. పోలింగ్ శాతం పెంచాలన్నారు. మీడియా, కమ్యూనికేషన్ ప్లాన్ నోడల్ అధికారి రజని పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అండుబాటులో ఉంటా

- కాంగ్రెస్ అభ్యర్థి విజయరమణారావు



కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు



రాఘవాపూర్‌లో చేపట్టిన ర్యాలీలో కాంగ్రెస్ అభ్యర్థి విజయరమణారావు, ప్రజలు, పార్టీ శ్రేణులు

పెద్దపల్లిరూరల్: పదేళ్ల బీఆర్ఎస్ అవినీతి, అరాచక పాలనను అంతమొందించే సమయం ఆసన్నమైందని కాంగ్రెస్ అభ్యర్థి విజయరమణారావు అన్నారు. అప్పన్నపేట, రాఘవాపూర్, రంగాపూర్, ముత్తారం, పెద్దకల్వల, నిట్టూరులో ఆయన బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనను ఆశీర్వదించి గెలిపించాలని, అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని విజయరమణారావు అన్నారు. అక్రమంగా దోచిన రూ.కోట్లతో ఎమ్మెల్యే పోటీకి దిగితే తాను జనబలాన్నే నమ్ముకున్నానని తెలిపారు. తనకు విదేశాల్లో బ్యాంకు ఖాతాలు ఉన్నాయంటూ కుట్రపూరిత ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు వాస్తవాలు గ్రహించి కాంగ్రెస్‌కు అండగా నిలవాలని కోరారు. కాగా, పెద్దపల్లి మున్సిపల్‌లోని అధికార బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఉప్పు స్వరూపరాజు, సుదమల్ల అమ్రేశ్, ఎరుకల కల్పనరమేశ్, సింగిల్‌విండో డైరెక్టర్ కొమ్ము సుధాకర్, కొట్టె లక్ష్మణ్ తదితరులు మాజీ ఎమ్మెల్యేలు విజయరమణారావు, బిరుదు రాజమల్లు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మున్సిపాలిటీలోనూ ఎమ్మెల్యే తన అధికారం చలాయించడాన్ని తట్టుకోలేక ఈ నిర్ణయం తీసుకున్నామని కౌన్సిలర్లు తెలిపారు. నాయకులు శంకర్, సత్యనారాయణరెడ్డి, సాంబిరెడ్డి, రమేశ్ పాల్గొన్నారు. కాగా, అప్పన్నపేటలో ఓ యువకుడు కాంగ్రెస్ జెండాతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు.

కాంగ్రెస్‌లో చేరిక..

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండల కేంద్రానికి చెందిన యువకులు తూండ్ల శ్రీనివాస్, సాయి, పాల సునిల్, చిలుముల సందీప్, ఇనుగాల లోకేశ్, తాండ్ర సతీశ్, గడ్డం భూమేశ్, చిట్యాల స్వామి తదితరులు మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ నేతృత్వంలో కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు గాజనవేన సదయ్య, అల్లం దేవేందర్, రమేశ్ పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

ఓదెల(పెద్దపల్లి): కన్నతల్లి లాంటి కాంగ్రెస్‌ను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి బైరి రవిగౌడ్ కోరారు. విజయరమణరావును గెలిపించాలని కొలనూర్‌లో ఇంటింటా ప్రచారం చేశారు. నాయకులు మైసయ్య, నారాయణగౌడ్, రాజయ్య, సామరాజు, లక్ష్మారెడ్డి, స్వామి, రాజయ్య పాల్గొన్నారు.

నోటా చరిత్ర

మీకు తెలుసా?

సాక్షి, పెద్దపల్లి: ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేలా, బరిలో నిలిచిన అభ్యర్థుల్లో ఎవరు నచ్చకపోతే నోటాను (నన్ ఆఫ్ ద ఎబౌ) 2013లో ఎన్నికల సంఘం తొలిసారిగా ప్రవేశపెట్టింది. దీంతో నోటా ఆప్షన్ ఇచ్చిన 14వ దేశంగా భారత్ నిలిచింది. నోటా ప్రవేశపెట్టిన నాటినుంచి బ్యాలెట్ పత్రంపై 'నోటా' అనే ఆంగ్ల అక్షరం ముద్రించి ఉంచుతోంది. నోటా కంటే ముందు సైతం అభ్యర్థులు నచ్చకపోతే పోలింగ్ కేంద్రంలో ఫారం – 17 నింపి సంతకం చేసి, ప్రిసైడింగ్ అధికారి వద్ద సంతకం చేసిన తర్వాత బ్యాలెట్ బాక్స్‌లో వేసే అవకాశం ఉండేది. అయితే, ఈప్రక్రియ రహస్య ఓటింగ్‌కు విరుద్ధమనే అభిప్రాయంతో దీనికి బదులు నోటా తీసుకొచ్చారు. నోటాకు పోటీలో నిలిచిన అభ్యర్థి కంటే ఎక్కువఓట్లు వస్తే ఎన్నికలు రద్దు కావు.. కానీ, రెండోస్థానంలో ఉన్న అభ్యర్థిని గెలిచినట్లు ప్రకటిస్తారు. నోటాకు పడిన ఓట్లను రద్దు చేసిన ఓట్ల కేటగిరీలో ఉంచుతామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. దీంతో మనదేశంలో ఎన్నికలపై నోటా ప్రభావం లేదు. కొన్నిదేశాల్లో మాత్రం నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే ఆ ఎన్నికను రద్దు చేయడం, అక్కడ పోటీ చేసినవారు మరే ఎన్నికల్లో పోటీచేయకుండా నిషేధం విధించడం ఉంది.

నువ్వు యాడికెళ్తే.. ఆడికొస్త..

- ముగిసిన నామినేషన్ల పర్వం.. పెరిగిన ప్రచార హోరు
- ఓటర్లను కలుసుకునేందుకు నేతల పాట్లు



సాక్షి,పెద్దపల్లి: పోలింగ్ గడువు ఒకవైపు తరుముకొస్తోంది.. మరోవైపు చలికాలం ఎమ్మెల్యే అభ్యర్థులను కష్టాలకు గురిచేస్తోంది. అయినా ఇవేవీ పట్టించుకోకుండా ఓటర్లు ఎక్కడ ఉంటే అక్కడకు వెళ్లి వారిని ప్రసన్నం చేసుకోవటానికి అభ్యర్థులు నానా పాట్లుపడుతున్నారు. ఉదయం 6గంటలకే ప్రచారం ప్రారంభిస్తూ, రాత్రి పొద్దుపోయేదాక ప్రచారం చేస్తున్నారు. మరోవైపు రాత్రివేళల్లో రహస్య మంతనాలు సాగిస్తూ ఎన్నికల వ్యూహాలు రచిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ముగిసి, పోలింగ్ గడువు సమీపిస్తుండడంతో క్షేత్రస్థాయిలో ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు పోటాపోటీగా ముందుకెళ్తున్నారు. గ్రామం నుంచి ఉపాధి అవకాశాల కోసం హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాలకు వలస వెళ్లినవారి గురించి ఆరా తీస్తూ పోలింగ్ నాటికి ఇక్కడకు వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

జనం ఉన్నచోటుకే ..

- ప్రస్తుతం జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వరికోతలు జోరందుకున్నాయి.
- గ్రామీణ ప్రజలు పొలం పనులకు వెళ్తున్నారు.
- మరికొందరు ఉపాధి కోసం తోటలు వేరడానికి, ఉపాధిహామీ పనులకు వెళ్తున్నారు.
- దీంతో చాలాప్రాంతాల్లో ఉదయం ఊళ్లో ఎవరూ ఉండటం లేదు.
- అభ్యర్థులు సైతం ఉదయమే ప్రచారం నిర్వహించేలా చూసుకుంటున్నారు.
- దీంతో ఓటర్లు ఉన్నవ్యవసాయ పనులు, వంద రోజుల పనిచేసే ప్రాంతాలకు వెళ్లి మరీ ఓట్లు అభ్యర్థిస్తున్నారు.
- ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయటం కంటే జనం ఎక్కడ ఎక్కువ జమైతరో అక్కడకే వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు.
- ఎన్నికల్లో గెలుపోటములు స్వల్ప ఓట్లతోనే ముడిపడి ఉండటంతో ప్రతీ ఓటరును కలిసేలా ప్రచారం చేస్తున్నారు.
- వీరి అభ్యర్థనకు ఓటర్లు కూడా సానుకూలంగా స్పందిస్తున్నారు.
- అలాగే ప్రతీఓటరును పోలింగ్ సమయానికి గ్రామానికి రప్పించే బాధ్యతలను ప్రత్యేకంగా తమ సమీప నేతలకు అప్పగిస్తున్నారు.

ఇంటి నుంచే ఓటు వేయండి

- ఎన్నికల నోడల్ అధికారి జ్యోతి



మాట్లాడుతున్న నోడల్ అధికారి జ్యోతి

జ్యోతినగర్(రామగుండం): వృద్ధులు, దివ్యాంగులు తమ ఇంటి నుంచే ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం 12–డి పద్ధతిని ఆమోదించిందని రామగుండం అసెంబ్లీ ఎన్నికల నోడల్ అధికారి జ్యోతి అన్నారు. బుధవారం ఎన్టీపీసీ టెంపరరీ టౌన్‌షిప్‌లోని మిలీనియంహాల్‌లో సెక్టర్, ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు 12–డిపై అవగాహన కల్పించారు. ఈ నూతన విధానంలో 80ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, కోవిడ్ బాధితులు తమ ఇళ్లనుంచే ఓటువేసే అవకాశం కల్పించిందని తెలిపారు. దీనికింద ఇప్పటిదాకా 331 మంది దరఖాస్తు చేశారని, ఇందులో 184 మంది దివ్యాంగులు, 147మంది 80ఏళ్ల వయసు పైబడిన వారు ఉన్నారని తెలిపారు. నూతన ప్రక్రియ సక్రమంగా సాగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, ట్రైనింగ్ నోడల్ అధికారి సంపత్‌రావు, మాస్టర్ ట్రైనర్స్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్టీఆర్, మేనకాగాంధీ(ఫైల్)

ఎన్నికల శిల్పం

ఒకే వేదికపై మహామహులు

మంథని: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 1983 అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు ప్రసంగించారు. సంజయ్ విచార్ మంచ్ అభ్యర్థి చందుపట్ల రాజిరెడ్డికి మద్దతుగా ఎన్టీఆర్ మంథనిలో ప్రచారం చేశారు. సంజయ్ విచార్ మంచ్ జాతీయ అధ్యక్షురాలు మేనకాగాంధీ, అభ్యర్థి చందుపట్ల రాజిరెడ్డి, దివంగత మాజీ ఎమ్మెల్సీ గీట్ల జనార్దన్‌రెడ్డి ఒకేవేదికపై కనిపించిన చిత్రం ఇది..

'మోసం చేస్తున్న ఎన్టీపీసీ'



సురేశ్‌బాబును సన్మానిస్తున్న నాయకులు

జ్యోతినగర్(రామగుండం): మహారత్న కంపెనీస్థాయికి ఎదిగిన ఎన్టీపీసీ తన ఉద్యోగులను అనేక రకాలుగా మోసం చేస్తోందని ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా ఆరోపించారు. బుధవారం పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని బీ–1, బీ–6 బ్లాక్ క్వార్టర్లను తొలగిస్తామని ఉద్యోగులకు నోటీసులు ఇవ్వడం హేయమన్నారు.ఇందుకు నిరసనగా త్వరలో వర్క్ టూ రూల్ చేపడతామని ప్రకటించారు.

సురేశ్‌బాబుకు సన్మానం

ఎన్టీపీసీ నెఫీ చైర్మన్‌గా ఎన్నికై తొలిసారి రామగుండం వచ్చిన సురేశ్‌బాబును శాలువాతో సన్మానించారు. అధికారుల సంఘం అధ్యక్షుడు ఎంజే నాయుడు, నాయకులు శేషుబాబు, కనకయ్య ఉన్నారు.

ఎన్నికల ఖర్చు రూ.40లక్షలే..



సమావేశమైన అధికారులు

మంథని: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ప్రచార ఖర్చు రూ.40 లక్షలు మించరాదని ఎన్నికల పరిశీలకుడు సీఎస్ శ్రీధర, వ్యయ పరిశీలకుడు సునీల్ శ్రీ వాత్సవ సూచించారు. బుధవారం మంథని ఎమ్మెల్యే అభ్యర్థులు, ప్రతినిధులు, తహసీల్దార్లతో పట్టణంలో సమావేశమయ్యారు. అభ్యర్థుల ఖర్చు వివరాలను ఈనెల 20, 24, 28 తేదీల్లో వ్యయ పరిశీకులకు సమర్పించాలన్నారు. ప్రచార వాహనం అనుమతి తీసుకోవాలని, కేటాయించిన సమయంలోనే ప్రచారం చేయాలని చెప్పారు. ఓటర్ స్లిప్పుల పంపిణీ, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సహాయ వ్యయ పరిశీలకుడు శ్రీనివాస్, రిటర్నింగ్ అధికారి హనుమానాయక్, ఏసీపీ మల్లారెడ్డి, తహసీల్దార్ రాజయ్య, మీడియా సెల్ నోడల్ అధికారి రవీందర్, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ సంతోష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ ప్రాజెక్టు లేబర్ గేట్ రాజీవ్ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గోదావరిఖని ఎల్‌బీ నగర్‌కు చెందిన భార్గవ్ తన ద్విచక్ర వాహనంపై పెద్దపల్లి వైపు వెళ్తుండగా.. పెద్దపల్లి వైపు నుంచి ప్లాంట్‌కు వస్తున్న లారీ క్రాసింగ్ వద్ద బైక్‌ను ఢీకొంది. దీంతో భార్గవ్ కాలుకు తీవ్ర గాయం కాగా చికిత్స నిమిత్తం ఖని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.

హార్వెస్టర్ దహనం



కాలిపోయిన హార్వెస్టర్ ముందుభాగం

పాలకుర్తి(రామగుండం): పుట్నూర్ గ్రామంలోని రైతు నార సత్తయ్యకు చెందిన హార్వెస్టర్‌ను దుండగులు దహనం చేశారు. సత్తయ్య గ్రామశివారులోని తన పొలంలో మంగళవారం రాత్రి వరకూ వరికోశాడు. యంత్రాన్ని పొలంలోనే ఉంచి ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా హార్వెస్టర్ ముందుభాగం పూర్తిగా కాలిపోయి ఉంది. రాత్రివేళ దుండగులు ఈదుశ్చర్యకు పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. ఈ విషయంపై బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. ఈఘటనలో దాదాపు రూ.10లక్షల నష్టం వాటిల్లినట్లు సత్తయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.

విధులకు ఆటంకం కలిగించిన కేసులో ఒకరికి రెండేళ్ల జైలు

సిరిసిల్లక్రైం: పోలీస్ అధికారిపై దాడి చేసి విధులకు ఆటంకం కలిగించిన కేసులో ఒకరికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ సిరిసిల్ల న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పు వెల్లడించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడించిన వివరాల ప్రకారం 2013 జూలై 28న సిరిసిల్ల పట్టణం విద్యానగర్‌లో తబ్లిక్ జమాత్, సున్నీ జమాత్‌కు చెందిన ముస్లింలు రెండుగా విడిపోయి గొడవ చేసుకున్నారు. దీనిపై సమాచారం అందుకున్న అప్పటి సీఐ ప్రస్తుత డీఎస్పీ నాగేంద్రచారి తన సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి వెళ్లి ఆపేందుకు ప్రయత్నించారు. ఈక్రమంలో సిరిసిల్లకు చెందిన మహ్మద్ తాజ్ సీఐపైకి రాయి విసరడంతో చేతికి గాయమైంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దాడికి కారణమైన తాజ్‌ను రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పును వెల్లడిస్తూ మహ్మద్ తాజ్‌కు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 2 వేల జరిమానా విధించారు. శాంతిభద్రతల రక్షణలో అనునిత్యం పని చేసే పోలీస్ అధికారులు, సిబ్బందిపై దాడులకు దిగిన, విధులకు ఆటంకం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు.

గోదావరిఖనిలో..

గోదావరిఖని: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి ఐదురోజుల జైలు శిక్ష విధించినట్లు రామగుండం ట్రాఫిక్ సీఐ టి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇద్దరు వ్యక్తులు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడగా బుధవారం గోదావరిఖని సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ వెంకటేశ్ దుర్వ ఎదుట పోలీసులు హాజరుపర్చారు. దీంతో ఇద్దరికి ఐదు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

మాతాశిశు ఆస్పత్రికి సుస్తీ

- సామాజిక వైద్యశాలలో వైద్యుల కొరత
- ఒక్కరే స్త్రీవైద్య నిపుణురాలు
- పిల్లల వైద్యు నిపుణుడూ ఒక్కరే..
- అత్యవసర వైద్యం అవసరమైతే అంతే..
- వంతుల వారీగా సిబ్బంది విధులు
- మంథనిలో సర్కారు వైద్యం దుస్థితి ఇది



మంథనిలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం

మంథని: ప్రొఫెసర్ జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల పరిధిలోని పేదలకు సర్కారు వైద్యం అందని ద్రాక్షగానే మారింది. ఆయా మండలాలకు పెద్దదిక్కుగా ఉన్న సామాజిక వైద్యశాల, మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. అయితే, ఉన్నవారు వంతుల వారీగా విధులకు హాజరవుతున్నారు. దీంతో ప్రభుత్వ వైద్యంపై పేదల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. కానీ, ఆస్పత్రి నిర్వహణ గాడితప్పుతోంది.

ఇక్కడ అత్యవసర వైద్యం అరుదే..

- మాతాశిశు మరణాల నియంత్రణకు పట్టణ శివారులో మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశారు.
- ఇందులో ఇప్పటికీ అత్యవసర వైద్యసేవలు అందడంలేదు.
- దీంతో గర్భిణులు, బాలింతలు, పిల్లలు సుదూరంలోని పెద్దపల్లి, గోదావరిఖని ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది.
- ఆరోగ్య కేంద్రంలో ఒక స్త్రీవైద్య నిపుణురాలు, మరో పిల్లల వైద్యుడు, ఇద్దరు మత్తు మందు ఇచ్చే వైద్యులు మాత్రమే ఉన్నారు.
- అనెస్తీషియాలు ఆపరేషన్లు ఉంటేనే ఆస్పత్రికి వస్తున్నారు.
- మిగతా సమయాల్లో విధులకు గైర్హాజరవుతున్నారని సమాచారం.
- ఒకవేళ వచ్చినా కేవలం సర్జరీలు పూర్తయ్యాక వెళ్లిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- స్త్రీ, పిల్లల వైద్యనిపుణులు ఓపీ సమయంలో అందుబాటులో ఉంటున్నారు.
- సర్జరీలు, ఓపీ సమయంలో పేషెంట్లకు సేవలు అందిస్తున్నారు.
- ఆ తర్వాత అతవసర సేవలకు వచ్చేవారికి అందుబాటులో ఉండడం లేదనే విమర్శలుఉన్నాయి.
- ప్రధానంగా డెలివరీలు, ఇతర సర్జరీలు, పిల్లలకు అత్యవసర చికిత్స సమయాల్లో వైద్యులు అందుబాటులో ఉండడం లేదని ఆరోపణలు ఉన్నాయి.
- రెండు నెలల క్రితం గోదావరిఖని నుంచి మరో స్త్రీ వైద్య నిపుణురాలిని డెప్యుటేషన్‌పై నియమించినా.. కొద్దిరోజులకే రద్దుచేశారు.

రెఫర్ చేసేందుకే మొగ్గు..

సామాజిక వైద్యశాలలో ప్రథమ చికిత్సే అందుతోందని, ప్రమాదాలు, ఇతర అత్యవసర వైద్యం కోసం వచ్చేవారిని గోదావరిఖని, పెద్దపల్లి, కరీంనగర్‌కు రెఫర్ చేస్తున్నారని బాధితులు చెబుతున్నారు. జ్వరం, బీపీ స్థాయిలు అధికంగా ఉన్నా, చిన్నగాయమైనా అక్కడి ఆస్పత్రులకే రెఫర్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రిలో 11 మంది వైద్యులకు ఏడుగురే ఉన్నారు. ఇందులో అసిస్టెంట్ సివిల్ సర్జన్ ఒక్కరే రెగ్యులర్ డాక్టర్. ఐదుగురు కాంట్రాక్ట్ పద్ధతిన సేవలు అందిస్తున్నారు. మరో జనరల్ మెడిసిన్ వైద్యుడు డెప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. వీరుకూడా వంతుల వారీగా విధులకు హాజరు కావడం, ఒక్కరిద్దరే మిగతా వారి విధులు నిర్వర్తించడంతో పనిభారం పడుతోంది. అసహనం పెరిగి పేషెంట్లతో దురుసుగా ప్రవర్తిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

ఎన్నికల తర్వాత ఖాళీల భర్తీ

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది పోస్టుల ఖాళీలను ఎన్నికల ప్రక్రియ ముగిశాక భర్తీచేస్తాం. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులో ఉంది. పనిభారం పెరిగిన పేషెంట్లకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సమీపంలోని గోదావరిఖని నుంచి డెప్యుటేషన్‌పై వైద్యులను నియమించి వారి సేవలు వినియోగిస్తున్నాం. అన్నివేళల్లో వైద్యం అందిస్తున్నాం.

– రమాకాంత్, సూపరింటెండెంట్, జిల్లా ప్రధాన ఆస్పత్రులు, పెద్దపల్లి

తబిత ఆశ్రమం సందర్శన



తబిత ఆశ్రమంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

రామగుండం: పట్టణంలోని తబిత సంరక్షణ కేంద్రాన్ని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బుధవారంబ సందర్శించారు. బాలల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. చిన్నారులతో కలిసి కలెక్టర్ కింద కూర్చొని చిన్ననాటి ఘటనలు వివరించారు. ప్రతీవ్యక్తికి జీవితంలో అనేక సమస్యలు వస్తాయని, వాటిని ధైర్యంగా ఎదుర్కొని లక్ష్య సాధనకు పాటుపడాలని సూచించారు. ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతీరోజు వ్యాయామం చేయాలని, పౌష్టికాహారం, సాత్విక ఆహారం తీసుకోవాలని సూచించారు. చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఆశ్రమ నిర్వాహకుడు వీరేందర్‌నాయక్, జిల్లా సంక్షేమ అధికారి రవూఫ్‌ఖాన్, సీడీపీవో స్వరూపరాణి పాల్గొన్నారు.

అన్నా.. ఎవరు గెలుస్తరే..

- అభ్యర్థులపై జోరుగా అంచనాలు
- నియోజకవర్గంలో పెరుగుతున్న బెట్టింగులు

జంగ్ తెలంగాణ

జ్యోతినగర్(రామగుండం): మొన్నటివరకు అన్నా.. టికెట్ ఎవరికి వస్తదే.. అని చర్చించుకున్నవారు.. ప్రస్తుతం మన రామగుండం నుంచి ఎవరు గెలుస్తరని ఎడతెగని ముచ్చట్లు పెట్టుకుంటున్నారు. ఎక్కడ చూసినా ఇదే చర్చ.. గోదావరిఖని, ఎన్టీపీసీ, రామగుండం, యైటింక్లయిన్‌కాలనీ ప్రాంతాల్లోని ప్రధాన సెంటర్లు, హోటళ్లు, పాన్‌షాపులు, మద్యం దుకాణాలు, కూరగాయల మార్కెట్లు, కిరాణాల వద్ద రామగుండం రాజకీయంపైనే చర్చ కొనసాగుతోంది.

అటుగా వెళ్తున్న వారిని ఆపి..

- అటుగా వెళ్తున్న పరిచయస్తులను ఆపి మరీ మీ ఏరియాలో ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తాయి, ఎవరు గెలుస్తారు? అని పిలిచి చర్చించి, ప్రశ్నించి వివరాలు తెలుసుకుంటున్నారు.
- ఇలా ముఖపరిచయం ఉన్నవాళ్లు, తెలిసిన వాళ్లు చర్చించుకుంటున్నారంటే ప్రధాన కూడలిలో మాత్రం పరిచయం లేనివాళ్లతో మాటామాట కలిపి ఎన్నికల వివరాలు తెలుసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.
- పక్కనియోజకవర్గాల వారితోకూడా మాటలు కలిపి సమాచారం అడిగి తెలుసుకుంటున్నారు.
- నియోజకవర్గంలోని ఏ గ్రామాల్లో ఏ అభ్యర్థికి విజయావకాశాలు ఉన్నాయి? ఎవరు గెలుస్తారనే అంశాలపై జోరుగా చర్చించుకుంటున్నారు.
- అవతలి వ్యక్తి ఏ పార్టీవైపు మొగ్గు చూపుతున్నారో అడిగి మరీ తెలుసుకుంటున్నారు.
- అయితే ఈ చర్చలు ఎవరిని ఉద్దేశించినవిగా చెప్పడం లేదు.
- ఎవరికివారే గెలిస్తే మాకేంటీ? రోజూ మనం చేసే పనైతే తప్పదు కదా? అంటూ మళ్లీ మాటలు దాటవేస్తున్నారు.
- రామగుండం నియోజకవర్గంలో కార్పొరేషన్, అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

అభ్యర్థులపై అంచనాలు..

పోలింగ్ తేదీ సమీపిస్తున్న క్రమంలో నియోజకవర్గంలో రాజకీయ వేడిరగులుతోంది. ప్రధాన పార్టీల తరఫున పోటీచేస్తున్న అభ్యర్థుల పేర్లతోపాటు స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్న ఓ వ్యక్తిపై జోరుగా బెట్టింగులు కడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. వివిధ కార్యకలాపాలపై నగర కేంద్రంగా కొందరు తరచూ వీటికి అలవాటు పడ్డారు. ఇప్పుడు ఏదో పదుల సంఖ్యలో ఎంతైనా బెట్టు కాస్తామంటున్నారు. ఎమ్మెల్యేగా ఎవరు గెలుస్తారు? ఏ పార్టీ అధికారంలోకి వస్తుందని పందెం కాస్తున్నారు. అది రూపాయల నుంచి రూ.లక్షల్లోకి వెళ్తున్నట్లు తెలుస్తోంది. పార్టీలో ఉన్న చోటామోటా నాయకుల నుంచి వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థుల వరకూ ఎన్నికలపై ఆసక్తి చూపుతున్నారు. ఈ అక్రమ బెట్టింగులపై పోలీసుల నిఘా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఓటర్లు అంటున్నారు.

ఆర్టీసీ బస్సు లారీ ఢీ.. తప్పిన ప్రమాదం



ఢీకొన్న ఆర్టీసీ బస్సు, లారీ

ముత్తారం:కాసార్లగడ్డ బస్టాండ్‌లో బుధవారం ఆర్టీసీ బస్సు, లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఓడెడ్ నుంచి గోదావరిఖనికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ఓడెడ్‌కు వైపు వస్తున్న లారీ అదుపుతప్పి ఢీకొనడంతో బస్సు అద్దాలు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. బస్సులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. కాసార్లగడ్డ – అడవిశ్రీరాంపూర్ చౌరస్తా, ప్రభుత్వ ఆస్పత్రి, మంథని–ఓడెడ్ ఆర్ అండ్ బీ రోడ్డుకు ఇరువైపులా ఇరుకుగా ఉండడంతో తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. రోడ్డును ఆక్రమించిన దుకాణాదారులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత వెంకట్రావుపల్లి ప్రభుత్వ పాఠశాలలోని 6 పోలింగ్ కేంద్రాలను గ్రామ ప్రత్యేకాధికారి భాస్కర్, ఆర్జీ–2 ఏరియా సింగరేణి సివిల్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఇక్కడ కనీస సౌకర్యాలు కల్పించాలనే విన్నపం మేరకు వారు ఏర్పాట్లు పరిశీలించారు. సింగరేణి సివిల్ అధికారి రాధాకృష్ణ, సిబ్బందితో వచ్చి పోలింగ్ కేంద్రాలు పరిశీ లించారు. తగిన సౌకర్యాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. వారివెంట గ్రామ కార్యదర్శి రమాదేవి, సింగరేణి అధికారలు ఉన్నారు.

మంత్రి కేటీఆర్ వాహనం తనిఖీ

రుద్రంగి(వేములవాడ): ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం రుద్రంగికి వస్తున్న మంత్రి కేటీఆర్ వాహనాన్ని పోలీస్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేశారు. మంత్రి కేటీఆర్ చిరునవ్వుతో తనిఖీలకు సహకరించి నిబంధనలు ఎవరికైనా వర్తిస్తాయన్నారు.

రేవంత్‌రెడ్డి వాహనం..

గంభీరావుపేట(సిరిసిల్ల): జిల్లా సరిహద్దు గంభీరావుపేట మండలం పెద్దమ్మ స్టేజీ చెక్‌పోస్టు వద్ద బుధవారం టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. కామారెడ్డి నుంచి సిరిసిల్ల వైపు వస్తున్న రేవంత్‌రెడ్డి వాహనాన్ని ఆపి అధికారులు తనిఖీలు నిర్వహించారు.

మీకు తెలుసా?

బైండోవర్ అంటే ఏమిటి?

సాక్షి, పెద్దపల్లి: ఎన్నికల సమయంలో పోలీసుల నోట తరచూ వినిపించే పదం 'బైండోవర్'. చాలామంది ఓటర్లకు బైండోవర్ అంటే ఏమిటో తెలియదు. బైండోవర్ అంటే బాండ్ ఫర్ గుడ్ బిహేవియర్. ఎన్నికల వేళ శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసులు పాతనేరస్తులను అదుపులోకి తీసుకుంటారు. రౌడీషీటర్లు, సారా తయారీదారులు, అమ్మకదారులు, బెల్ట్ షాపుల నిర్వాహకులు, ఇతర కేసుల్లోని నిందితులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తారు. అనంతరం వారిని తహసీల్దార్, ఆర్డీవోల ఎదుట హాజరుపరుస్తారు. సీఆర్‌పీసీ – 107, 108, 109, 110 సెక్షన్ల కింద బైండోవర్ చేసి.. ఆ తర్వాత వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేస్తారు. వీరు తహసీల్దార్ వద్ద బాండ్ పేపర్‌పై చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడబోమని లిఖితపూర్వక హామీ ఇవ్వాలి. కొంత మొత్తం నగదు లేదా స్థిరాస్తి ష్యూరిటీ చూపించాలి. బైండోవరైన వ్యక్తులు ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా ష్యూరిటీ పెట్టిన సొమ్ము నుంచి వసూలు చేస్తారు. వీరు ఎన్నికల వేళ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని తమ అధీనంలోనే ఉంచుకుంటారు.

ఉపాధ్యాయుల ఊసేలేని మేనిఫెస్టోలు

- పీటీడబ్ల్యూ?ఏ జిల్లా అధ్యక్షుడు కేఎస్ నందు



మాట్లాడుతున్న నందు

రామగుండం: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే వివిధ రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోల్లో ప్రైవేట్ ఉపాధ్యాయుల ఊసేలేకపోవడం బాధాకరమని, తమ సంక్షేమానికి ప్రత్యేక మేనిఫెస్టో అవసరమని ప్రైవేట్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేఎస్ నందు అన్నారు. పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రైవేట్ ఉపాధ్యాయులు చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్నారన్నారు. కోవిడ్ మహమ్మారి నుంచి పరిస్థితి మరీ దారుణంగా తయారైందని ఆవేదన చెందారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల ప్రచారంతోపాటు మేనిఫెస్టోల్లో తమ సమస్యలు పొందుపరిచి పరిష్కారానికి చొరవ చూపాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ప్రైవేట్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కన్నూరి లక్ష్మ ణ్‌రావు, ప్రతినిధులు సంతోషి, సమీనా, రజని, నారాయణరావు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరికి ఏడాది జైలు

సిరిసిల్లక్రైం: ఆలయాల్లో దొంగతనం చేసిన కేసులో ఇరువురికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ రాజన్న సిరిసిల్ల న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే 2023 జూన్ 29న రగుడు ఎల్లమ్మ ఆలయం, సిరిసిల్ల విశ్వనాథ ఆలయంలో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలో చోరీ చేశారని ఆలయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించి మైలారం ఆశారాములు, బాల నర్సింహులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

చార్జిషీట్ దాఖలు చేసిన విచారణాధికారి

విచారణ అధికారి బీసీ నాయక్ కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా ఎస్సై లావుడ్య శ్రీకాంత్, కానిస్టేబల్ నరేశ్‌లు సాక్ష్యాలు ప్రవేశపెట్టడంతో పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితులు ఆశారాములు, నర్సింహులకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.



ఆద్యంతం ఆసక్తిగా..

క్షణక్షణం ఉత్కంఠ.. ఫైనల్‌కు చేరాలని, భారత్ గెలవాలని ఆకాంక్ష.. అందరిదీ ఒకే కాంక్ష.. జై భారత్.. జైజై భారత్ నినాదాలు.. గంటల కొద్దీ టీవీలకు అతుక్కుపోయిన యువత.. భారత్-న్యూజీలాండ్ సెమీ ఫైనల్ బుధవారం జరిగింది. ఈ మ్యాచ్‌ను టీవీల్లో తిలకిస్తూ యువత భారత్ విజయం కోసం ప్రార్థనలు కూడా చేశారు.. వారి ఆకాంక్ష నెరవేరింది.. ఇండియా ఫైనల్‌కు చేరుకుంది. గోదావరిఖనిలోని ఓ జెంట్స్ పార్లర్‌లో భారత్ - న్యూజీలాండ్ మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారాన్ని టీవీలో చూస్తున్న యువత.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

రూ.298 పింఛన్‌తో బతికేదెలా?

- సింగరేణి రిటైర్డ్ కార్మికుల వేదన

సాక్షి పీపుల్స్ ఎజెండా



గోదావరిఖని: సింగరేణి రిటైర్డ్ కార్మికుల మలిదశ జీవితం దుర్భరంగా మారుతోంది. విద్యుత్ ఉత్పత్తి కోసం నల్లబంగారం వెలికితీసి దేశానికి వెలుగులు అందిస్తున్న వారి జీవితాల్లో చీకట్లే అలముకుంటున్నాయి. సుమారు నాలుగు దశాబ్దాల పాటు సింగరేణి సంస్థ కోసం శ్రమించిన కార్మికులకు ఉద్యోగ విరమణ తర్వాత అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. మోకాళ్ల నొప్పులు, బీపీ, షుగర్, కాలేయ, ఊపిరితిత్తులు, కిడ్నీ సంబంధిత సమస్యలు వెంటాడుతున్నాయి. దీంతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ మందులతో జీవితం కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంది.

రిటైర్డ్ కార్మికులు 40వేల మంది..

- సింగరేణిలో ఇప్పటిదాకా ఉద్యోగ విరమణ చేసిన కార్మికులు సుమారు 40వేల మందికి పైగానే ఉన్నారు.
- వీరిలో రూ.298 నుంచి రూ.వెయ్యి పింఛన్ వచ్చే వారు సుమారు పదివేల మంది వరకు ఉన్నట్లుగా అంచనా.
- ప్రధానంగా 2008 సంవత్సరానికి ముందు రిటైర్ అయినవారికి పింఛన్ మరీ తక్కువగా వస్తోంది.
- వృద్ధాప్య సమస్యలతో సొంతంగా పనిచేయలేక, వచ్చే పింఛన్ సరిపోక, అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు.
- తక్కువ పింఛన్‌తో సుమారు 15 ఏళ్లుగా కాలం వెళ్ల దీస్తున్నా.. ఒక్కరూపాయి కూడా పెంచకుంటే బతికేదెలా? అని ప్రశ్నిస్తున్నారు.
- పేదరికంలో మగ్గుతూ నిరాదారణకు గురైన రిటైర్డ్ కార్మికులు ఉచిత వృద్ధాశ్రమాలను ఆశ్రయిస్తున్నారు.
- వీరి గోస ప్రస్తుతం ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు గుర్తించాలని కోరుతున్నారు.
- ఈ క్రమంలో కొందరు రిటైర్డ్ కార్మికులు తమ ఇబ్బందులను 'సాక్షి'తో పంచుకున్నారు.

పింఛన్ సరిపోతలేదు



జీడీకే–5 ఇంక్లయిన్‌లో 18ఏళ్లపాటు పనిచేసిన. 2001లో రిటైర్ అయిన. ప్రస్తుతం నెలకు రూ.553 పింఛన్ వస్తంది. ఇది ఏమాత్రంసరిపోవడం లేదు. ఆస్పత్రి ఖర్చులు పెరిగినయి. మార్కెట్‌లో అన్నిధరలు పెరిగినయి. ఇకగ మేం బతుడెట్ల? అధికారంలోకి వచ్చే పార్టీ ఈసారైనా మా గోస పట్టించుకోవాలె.

– కందుల మల్లయ్య

చాయ్‌కి సరిపోతలేవ్



రిటైర్ అయ్యాక అనారోగ్యంతో ఆస్పత్రుల చుట్టూ తిరగడమే సరిపోతంది. జీడీకే–6ఏగనిలో కోల్‌ఫిల్లర్‌గా పనిచేసి 2000లో దిగిపోయిన. ఇప్పుడు నెలకు రూ.298 పింఛన్ వస్తంది. ఈ సొమ్ము రోజూ ఒక చాయ్ తాగేందుకు కూడా సరిపోతలెవ్వు. ఇద్దరం ఎలా బతకాలి? నడుం, మోకాళ్ల నొప్పులున్నయ్.

– రామోజీల ప్రసాద్, రిటైర్డ్ కోల్‌ఫిల్లర్

పింఛన్ పెంచాలె



పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రిటైర్డ్ కార్మికులకు ప్రతినెలా రూ.15వేల పింఛన్ పెంచి ఇవ్వాలి. పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాలు లేవు. వారికి మేం భారంగా కాకుండా చూడాలి. చాలీచాలని పింఛన్‌తో చాలామంది ఉచిత వృద్ధాశ్రమాల వైపు వెళ్తున్నారు. మా సమస్యలపై దృష్టి సారించండి.

– జైహింద్, రిటైర్డ్ కార్మికుల సంఘం కార్యదర్శి

10వేల మంది గోస ఇది



రూ.వెయ్యిలోపు పింఛన్ వచ్చే రిటైర్డ్ కార్మికులు సుమారు 10వేల మందికి పైగా ఉన్నారు. రూ.298 నుంచి రూ.వెయ్యి వరకు వస్తోంది. ఇది ఏమాత్రం సరిపోదు. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు మా సమస్యలపై స్పందించాలి. పింఛన్ పెంచేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

– పీటీ స్వామి, రిటైర్డ్ కార్మికుల సంఘం